సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



మెరుగైన సౌకర్యాలు

కొమురవెల్లి జాతర కోసం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ కమిషనర్ తెలిపారు. వివరాలు 9లో ▸



ఆర్టీసీ బస్సు ఢీకొని..

ఝరాసంగం మండల పరిధిలో ఆర్టీసీ బస్సు ఢీకొని యువ రైతు మృతిచెందాడు.

వివరాలు 9లో ▸

నేడు డయల్‌యువర్ డీఎం

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం కోసం శుక్రవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. 9959223170 నంబర్‌కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

మీ సేవా కేంద్రంపై కేసు

పటాన్‌చెరు టౌన్: ప్రజాపాలన దరఖాస్తులు విక్రయిస్తున్న మీ సేవా కేంద్రంపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గణేష్ మీ సేవా కేంద్రంలో ప్రభుత్వం అందించే ప్రజా పాలన దరఖాస్తులు రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు పటాన్‌చెరు గ్రేటర్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మధు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మీ సేవా నిర్వాహకుడు నవీందర్ పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్పీ

పటాన్‌చెరు టౌన్: ఐదేళ్ల వయసు దాటిన పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ పీపీ రాథోడ్ సూచించారు. గురువారం సీఆర్పీ భాస్కర్ పట్టణంలో బడి బయట ఉన్న పిల్లలపై సర్వే నిర్వహించారు. నిజామాబాద్ నుంచి జేపీ కాలనీకి వలస వచ్చిన ఇద్దరు పిల్లలను గుర్తించి.. జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ సర్వే జనవరి 10వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ తెలిపారు. గురువారం పట్టణంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. పాఠ్యపుస్తకాల్లో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి, ఇందుకు సంబంధం లేని వారి వివరాలు చేరుస్తున్నారని అన్నారు. విద్యా పరిరక్షణ కోసమే చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, డివిజన్ నాయకుడు పవన్ పాల్గొన్నారు.

అభ్యర్థులు ఖర్చు వివరాలివ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి టౌన్ : అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల నిబంధనల ప్రకారం ఖర్చుల వివరాలు అందించాలని అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నిక ఖర్చు వివరాలు పకడ్బందీగా సమర్పించని అభ్యర్థులపై మూడేళ్ల అనర్హత వేటు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



జెండాను ఆవిష్కరిస్తున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ తెలిపారు. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో గురువారం జెండా ఆవిష్కరించి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటమే కాకుండా బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషిచేసిందని కొనియాడారు. బ్యాంకులను జాతీయం చేసి అన్నివర్గాలకు మేలు చేకూర్చిందని చెప్పారు. టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, సుధాకర్‌రెడ్డి, తాహెర్‌అలీ, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, ఈశ్వరప్ప, బీఎస్ వీరన్న పాల్గొన్నారు.

ప్రజల వద్దకు పాలన

- ఆరు గ్యారెంటీల అమలుకే దరఖాస్తుల స్వీకరణ
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డిలో మహిళ నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి / వట్‌పల్లి /రాయికోడ్(అందోల్) : సమస్యలు పరిష్కరించేందుకు ప్రజల వద్దకే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభించారు. పట్టణంలోని 3వ వార్డులో, చౌటుకూరు మండలం శివ్వంపేట, ఆందోల్ మండలం అల్మాయిపేట, సంగుపేట, రాయికోడ్ మండలం సింగితం గ్రామంలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమల్లోకి తెచ్చే బాధ్యత యంత్రాంగానిదేనని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ పాలనను తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందోల్ నియోజకవర్గంలో కంపెనీలను ఏర్పాటు చేసి ఇక్కడి యువతకు, ప్రజలకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సింగితం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు దరఖాస్తు చేసుకోలేని వారు గ్రామపంచాయతీలో సెక్రటరీకి, అధికారులకు అందజేయవచ్చని తెలిపారు. అనంతరం మంత్రి దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్లు ప్రారంభించారు. కౌంటర్ల వద్ద నేరుగా మహిళల నుంచి మంత్రి దరఖాస్తులు స్వీకరించారు.

ప్రత్యేక ఏర్పాట్లు

దరఖాస్తుల స్వీకరణకు మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులకు అధికారులు రశీదులు అందించారు. దరఖాస్తులు పూరించడానికి అంగన్వాడీలు, విద్యావంతులు, ఇతర సిబ్బంది సహకరించారు. సభ ప్రారంభమైన వెంటనే అధికారులు సీఎం సందేశాన్ని చదివి వినిపించారు. అన్ని సభలలో ప్రత్యేకించి మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ గ్రామాలలో, మున్సిపల్ వార్డులలో నిర్వహించిన ప్రజాపాలన సభలను సందర్శించి పర్యవేక్షించారు. అల్మాయిపేట ప్రజా పాలన కార్యక్రమం సభలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజా పాలన కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, ఆర్డీఓ రవీంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కమిషనర్ సుజాత, శివంపేట గ్రామ సభలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎంపీపీ చైతన్యరెడ్డి, దుర్గారెడ్డి, నత్తి దశరథ్, ఆర్డీఓ పాండు, డీఎంహెచ్‌ఓ గాయిత్రిదేవి, డీపీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు మల్లికార్జున్ పాటిల్, మాజీ జెడ్పీటీసీ నాగారం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

- జిల్లావ్యాప్తంగా 20,562
- తొలిరోజు 117 చోట్ల గ్రామ, వార్డు సభల నిర్వహణ
- కొన్నిచోట్ల ఫాంల కొరత..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాలో తొలిరోజు గురువారం 91 గ్రామపంచాయతీలు, ఎనిమిది మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 117 చోట్ల సభలు నిర్వహించారు. ఇందులో మొత్తం 20,562 దరఖాస్తులు వచ్చాయి. తొలిరోజు గ్రామ, వార్డు సభలను నిర్వహించిన పరిధిలో మొత్తం 50,315 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇందులో 20,562 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన మొత్తం కుటుంబాల్లో 40 శాతం కుటుంబాలు ఆరు గ్యారంటీల్లోని సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు తేలింది.

జీహెచ్‌ఎంసీ పరిధి పటాన్‌చెరులో..

సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఉన్న జీహెచ్‌ఎంసీ మూడు డివిజన్లలో 12 చోట్ల సభలు జరిగాయి. మొత్తం 3,120 మంది లబ్ధిదారులు ఆయా పథకాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. మరో 346 దరఖాస్తులు ఈ ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధం లేని పథకాల కోసం వచ్చినట్లు అధికారులు గుర్తించారు.

పలుచోట్ల దరఖాస్తుల కొరత

జిల్లాలో అక్కడక్కడ దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడింది. నారాయణఖేడ్ డివిజన్‌లో కొన్ని చోట్ల ఒక్కసారి స్థానికులు దరఖాస్తులు చేసుకునేందుకు తరలిరావడంతో కొందరికి ఫారాలు అందలేదు. దీంతో మరునాడు ఫారాలు పంపి దరఖాస్తులు తీసుకుంటామని చెప్పి పంపారు.

37క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన నిందితులతో విజిలెన్స్, పోలీసు అధికారులు

మనూరు(నారాయణఖేడ్): మండల కేంద్రం మనూరులో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ భోజనాయక్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ షెటర్‌లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను వాహనంలో నింపుతున్నట్లు పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు. విషయాన్ని ఆర్‌ఐకి సమాచారం ఇవ్వగా.. వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైదరాబాద్ విజిలెన్స్ అధికారి అయిన అడిషనల్ ఎస్పీ ద్రోణాచారులు, ఎస్‌ఐ సాంబశివరావు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, సాయిరవిలు మనూరుకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 37క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా డంపింగ్ చేసి తరలిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి తండాకు చెందిన వడితేరాజు రేషన్ బియ్యాని కొనుగోలు చేసి బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అమ్మినా.. కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిరాక్స్ దరఖాస్తులు చెల్లవు

నారాయణఖేడ్ : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం గురువారం నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు పత్రాలను అధికారులే అందజేస్తారని ఆర్డీఓ వెంకటేశ్ తెలిపారు. జిరాక్స్ దరఖాస్తు పత్రాలు చెల్లవని అన్నారు. నిర్ణీత ఫార్మాట్‌లో ఉన్న దరఖాస్తు ఫారాలను పూరించి రేషన్ కార్డు, కుటుంబీకులందరి ఆధార్‌కార్డుల ప్రతులను జతచేసి అధికారులకు అందజేయాలని సూచించారు.

ప్రజాపాలనకు మంచి స్పందన



దరఖాస్తులు చూస్తున్న చంద్రశేఖర్

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజా పాలన కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని రేజింతల్, హద్నూర్, న్యాల్‌కల్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. రేజింతల్‌లో వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎల్‌పీఓ రాఘవ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న స్వప్న

హత్నూర (సంగారెడ్డి): అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న అన్నారు. గురువారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా హత్నూర మండలం దౌల్తాబాద్, గుండ్ల మాచునూర్, లింగాపూర్‌లలో గ్రామ సభలు నిర్వహించారు. దౌల్తాబాద్‌లో ఆమె మాట్లాడారు. రేషన్ కార్డు లేని ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అది ఉంటేనే సంక్షేమ పథకాలకు అర్హులన్నారు.

6 వరకు దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: ఆరు గ్యారంటీల్లో ఐదింటి అమలుకు జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, అర్హులు దీనిని వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం రామేశ్వరం బండలో ఆయన గ్రామ సభను ప్రారంభించారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధిలో, భానూర్, క్యాసారం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

న్యాల్‌కల్(జహీరాబాద్): చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పనకు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, వారి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం న్యాల్‌కల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 56 శాతం జనాభా గల బీసీలకు రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కులగ గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల అభివృద్ధి కోసం రూ.2లక్షల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. జడ్జిల నియామకాల్లో కూడా రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రకారం బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్, ప్రముఖ న్యాయవాది మోహీమ్, జేఏసీ జిల్లా కన్వీనర్ కొత్తగొల్ల సత్యయ్య యాదవ్, మల్గి సర్పంచ్ మారుతి యాదవ్, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకులాల్లోనే నాణ్యమైన విద్య

- సెంట్రల్ మైనార్టీ సెక్రటరీ శ్రీనివాస్



అల్గోల్ గురుకులంలో పర్యటిస్తున్న శ్రీనివాస్

జహీరాబాద్ టౌన్: మండలంలోని మైనార్టీ గురుకులాలను గురువారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్‌కే. శ్రీనివాస్ సందర్శించారు. అల్గోల్ బాలుర మైనార్టీ, బూచినెల్లి బాలికల మైనార్టీ గురుకులాలను పరిశీలించి సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. అక్కడ ఇస్తున్న నీట్, ఎన్‌డీఏ కోచింగ్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యతో పాటు క్రీడల్లో ఇస్తున్న శిక్షణను అభినందించారు. గురుకులాల్లో చక్కటి వసతులతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట గురుకులాల అకాడమిక్ హెడ్ లతీఫ్, డీఎండబ్ల్యు దేవుజ, ఆర్‌ఎస్‌సీ డాక్టర్ నర్సింహ, ప్రిన్సిపాల్ రాములు, కేఎస్, జమీల్, కోఆర్డినేటర్ నాగార్జున, ఇబ్రహీం ఉన్నారు.

శరణ మేళా పోస్టర్ ఆవిష్కరణ



బసవ మంటపంలో ప్రార్థనలు చేస్తున్న మాతాజీ

జహీరాబాద్ టౌన్: కర్ణాటక రాష్ట్రం కూడల సంగం వద్ద ప్రారంభం కానున్న 37వ శరణ మేళా పోస్టర్‌ను బసవ పీఠాధిపతి మహిళా జగద్గురు డాక్టర్ గంగా మాతాజీ గురువారం ఆవిష్కరించారు. పట్టణంలోని దత్తగిరి కాలనీ బసవ మంటపంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వగురువు బసవేశ్వరుడి పుణ్యక్షేత్రమైన కూడల సంగంలో జనవరి 12 నుంచి మూడు రోజుల పాటు శరణ మేళా కొనసాగుతుందన్నారు. అంతకు ముందు బసవ మంటపంకు వచ్చిన మాతాజీని రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, జహీరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్పలు సన్మానించారు. అనంతరం ఆమె బసవేశ్వరునికి పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్, అక్కనబళగ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలే ప్రథమ కర్తవ్యం

- ఎస్పీ రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి : సమాజంలో శాంతి, ప్రజల రక్షణ, నేరాల నియంత్రణలో పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని ఎస్పీ రూపేష్ తెలిపారు. గురువారం వార్షిక క్రైమ్ రేట్ పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టం, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై కమ్యూనిటీ పోలీసింగ్, సోషల్ మీడియా, కళాబృందాలు, లఘు చిత్రాల రూపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళల భద్రత కోసం షీటీం బృందాలు పనిచేస్తున్నాయని అన్నారు. బాధితులకు భరోసా సెంటర్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 360 పోక్సో, అత్యాచార కేసులలో కౌన్సెలింగ్ ఇచ్చి సీడబ్ల్యూసీ ద్వారా షెల్టర్ కల్పించడంతో పాటు రూ:90,50,000 నష్ట పరిహారం ఇప్పించినట్లు పేర్కొన్నారు. భరోసా సెంటర్ సిబ్బంది మరింత మెరుగైన సేవలు అందించడానికి నూతన భవనాన్ని, బాల నేరస్తుల కోసం "చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్"ను గత అక్టోబర్ నెలలో మాజీ డీజీపీ అంజనీ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. నేరాల అదుపునకు జిల్లా వ్యాప్తంగా 1208 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టలను ఏర్పాటు చేసి రూ. 3,31,16,303 నగదు, 6966.83 గ్రాముల గోల్డ్, 7458 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి అక్రమంగా నిల్వ ఉన్న 1258.407 లీటర్ల మద్యం, 313.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న 1421 సిలిండర్స్, 634 కిలోల గంజాయి, 8 వేల లీటర్ల డీజిల్, రూ.70 లక్షల విలువ గల ఆల్ప్రాజోలం డ్రగ్ మొదలైనవి సీజ్ చేసినట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన రూ.22,71,55,295 నుంచి రూ:3,62,31,605 హోల్డ్ చేసినట్లు తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు వచ్చిన 19,822 పాస్ పోర్ట్ అప్లికేషన్ లలో 19,427 అప్లికేషన్లు క్లియర్ చేసినట్లు వివరించారు. సిబ్బందితో దర్బార్‌లు ఏర్పాటు చేసి పోలీస్ వెల్ఫేర్ సమస్యలు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

త్వరలో ఉచిత కుట్టుశిక్షణ

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో 2018 నుంచి 2013వరకు 100 పనిదినాలు పూర్తిచేసుకున్న మహిళలకు గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎస్‌బీఐ, ఆర్‌ఎస్‌ఈటీటీఐ సహకారంతో ఉచిత కుట్టుశిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మహిళా సమాఖ్య మేనేజర్ జ్యోతి, ఐకేపీ ఏపీఎం టిక్యా నాయక్ తెలిపారు. ఐకేపీ కార్యాలయంలో గురువారం శిక్షణకు సంబంధించి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. 60 మంది మహిళలు వస్తే అతిత్వరలో శిక్షణను ప్రారంభిస్తామని, నెలరోజుల పాటు రోజూ రూ.272 చొప్పున నగదు ఇవ్వడంతోపాటు భోజన వసతి కల్పిస్తామని చెప్పారు. డీపీఎం నాబార్డు సహకారంతో త్వరలో ఎంబ్రాయిడరీ లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఐకేపీ జేఆర్పీలు సురేఖ, వెంకట్‌రావు, సీసీలు రాజు, శివ్‌రాజ్, వెంకట్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒకరికి కరోనా పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా ఒకరికి పాజిటివ్ వచ్చింది. అలాగే 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

చలో హైదరాబాద్ పాదయాత్ర షురూ



పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: చెరకు రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను ఇప్పించడంతో పాటు క్రషింగ్‌ను ప్రారంభించాలని కోరుతూ రైతులు జహీరాబాద్ నుంచి పాదయాత్ర చేపట్టారు. గురువారం మండలంలోని బూర్దిపాడ్‌కు చెందిన రైతు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు రైతులు, నలుగురు కార్మికులు యాత్రను ప్రారంభించారు. కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం నుంచి యాత్రను చేపట్టారు. జనవరి 1వ తేదీన హైదరాబాద్‌కు యాత్ర చేరుకోనుంది. 2వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేయనున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి యాజమాన్యం రూ.9కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. 2023–24 సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు క్రషింగ్‌ను చేపట్టలేదని ఆరోపించారు. ఆయా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకే యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ నేత ఎం.జైపాల్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు కొండల్‌రెడ్డి, ఢిల్లీ వసంత్, పెంటారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

గజ్వేల్ : గజ్వేల్‌లో జనవరి 11 నుంచి 14 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కోసం గురువారం సిద్దిపేట జిల్లాకు చెందిన బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. పట్టణంలోని ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) మైదానంలో ఈ ఎంపిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది బాలురు, మరో 60 మంది బాలికలు ఇందులో పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జట్లలోకి ఎంపిక చేశారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సలహాదారు దేశబోయిని నర్సింలు, జిల్లా కోశాధికారి సత్యం, ఉపాధ్యక్షుడు రాజు, సంయుక్త కార్యదర్శులు మహేశ్, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించాలి

ఎన్ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ సింగం జయంతు



మాట్లాడుతున్న సింగం జయంతు

పటాన్‌చెరుటౌన్: మన చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపడం విజయానికి తొలిమెట్టుగా ఎన్ఐటీ రూర్కెలాలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ సింగం జయంతు అభివర్ణించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'వాలుల స్థిరత్వంపై జియోటెక్నికల్ పరిశోధన' అనే అంశంపై గురువారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. ఏదైనా సమస్యను పరిష్కరించాలనే ఉమ్మడి లక్ష్యంతో, దానిని ఓ ప్రాజెక్టుగా విద్యార్థులు చేపట్టి, వినూత్న పరిష్కారాలతో అద్భుత ఫలితాలను సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌కు 'అందె మ్యూజిక్ అకాడమీ' ఎంపిక



అందె భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌కు మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన అందె మ్యూజిక్ అకాడమీ ఎంపికైంది. ఈ మేరకు భారత సంగీత నాటక అకాడమీ, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఆహ్వానం లభించినట్లు అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ గురువారం తెలిపారు. డప్పు మహిళా బృందానికి అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

చేతికందే సమయం.. ఆగమాగం

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తుకున్న రైతులను ఈ ఏడాది చివరి క్షణంలో వర్షాలు ఆగమాగం చేశాయి. పంటలు చేతికందే సమయంలో మిఛాంగ్ తుపాన్ ప్రభావంతో రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. గతంకంటే ఈసారి సాగు గణనీయంగా పెరిగింది. మొదట్లో ఆశించిన మేర వర్షాలు కురిశాయి. జిల్లాలోని రిజర్వాయర్లు నీటిమట్టాలతో నిండిపోయాయి. ఉచిత విద్యుత్ సరఫరాతో సాగు నీటి కష్టాలు తీరి, పంటలు విరివిగా పండించారు. రైతుబంధు, రైతుబీమా వంటివి ఆశలు కలిగించాయి. కానీ చివరికి తుపాన్ ప్రభావంతో పంటలు పాడై నష్టాన్ని మిగిల్చాయి.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



తుపాన్ దాటికి తడుస్తున్న వరి ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

- చివరి క్షణంలో మిఛాంగ్ తుపాన్ దెబ్బ
- 51,261 ఎకరాల్లో రూ.51 కోట్ల పంట నష్టం
- పత్తి ధర ఢమాల్, నిండా మునిగిన వరి రైతులు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన సాగు
- మొదట్లో అనుకున్న స్థాయిలో వర్షాలు
- రైతుబంధు, రైతు బీమా కాస్త ఊరట

సిద్దిపేట జిల్లాలో వానాకాలం సాగులో భాగంగా రైతులు 5,27,906 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరి 3,66,169 ఎకరాల్లో సాగు చేశారు. ఉద్యాన పంటలు అయిన ఆయిల్‌పామ్, మల్బరీ, మామిడి, సపోట, బొప్పాయి, టమాట పంటలతోపాటుగా ఇతర నూతన పంటల సాగుకు రైతులు మక్కువ చూపారు.

వణికించిన తుపాన్..

జిల్లాలో వానాకాలం పంటలు చేతికందే సమయంలో మిఛాంగ్ తుపాన్ రైతులను బెంబేలెత్తించింది. వరి పంటను కోసి ఆరబెట్టిన ధాన్యం, అదే విధంగా కోత దశలో ఉన్న వరి పంట అధికంగా దెబ్బతింది. 5 రోజులపాటుగా మిఛాంగ్ తుపాన్ జిల్లాను వణికించింది. దీంతో జిల్లాలో 65,056 మంది రైతులకు చెందిన 51,261 ఎకరాల్లో రూ.51 కోట్ల మేర వరితో పాటుగా ఇతర పంటలు దెబ్బతిన్నాయి.

పత్తి రైతు చిత్తు..



జిల్లాలో పత్తి వేసిన రైతులు ధరతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 1.08లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా సేకరించే దశలో ధరలు పడిపోయాయి. 2022లో గరిష్ఠ ధర రూ.9 వేల వరకు పలికింది. 2023లో మాత్రం రూ.6500 మాత్రమే ఉంది. దీంతో పత్తి రైతులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.60 లక్షల క్వింటాళ్ల పత్తిని ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపారులు ఖరీదు చేశారు.

టాప్ గేర్‌లో టమాట

జిల్లాలో టమాట సాగు చేసిన రైతులకు ఈ సంవత్సరం ఆశించిన ధర కంటే అధిక ధర రావడంతో టాప్ గేర్‌లోకి దూసుకెళ్లారు. జిల్లాలో 700 ఎకరాల్లో టమాటను రైతులు సాగు చేశారు. దీంతో ఎకరకు 18 టన్నుల దిగుబడి వచ్చింది. రెండు నెలలపాటు టమాట ధర రూ.100కు పైగా ఉండడంతో రైతులు తమ కష్టానికి మించి ప్రతిఫలం అందుకున్నారు.

ఆదుకుంటున్న రైతుబంధు, రైతుబీమా

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం సత్ఫలితాలనిచ్చింది. వానాకాలం రైతుబంధుకుగాను 3,19,852 మంది రైతులకు రూ.313.23 కోట్లు అందాయి. కానీ యాసంగి రైతుబంధు ఇప్పటి వరకు 97,777 మంది రైతులకు రూ.20.30 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లాలో 361 మంది రైతులు మరణించగా వారి కుటుంబీకులకు రూ.18.05 కోట్ల రైతు బీమాను రాష్ట్ర ప్రభుత్వం అందించింది.

కొనుగోళ్లు అంతంతే..

జిల్లాలో 417 కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 3,62,193 క్వింటాళ్ల వరి ధాన్యం మాత్రమే సేకరించారు. మిగితా ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. గతేడాది 3,99,314 క్వింటాళ్ల వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీదు చేశారు. అంటే గతేడాది ఈ సంవత్సరం ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం తగ్గింది.



రివైండ్ 2023

ఆశించిన మేర వర్షాలు..



జిల్లాలో 2021-22తో పోలిస్తే, 2022-23 సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీనికి తోడుగా జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్, తపాస్‌పల్లి, శనిగరం రిజర్వాయర్లు నీటితో నిండిపోయాయి. 2022-23 సంవత్సరంకుగాను జిల్లాలో 1278.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లా సాధారణ వర్షపాతం 784.2 మిల్లీమీటర్లు కాగా అదనంగా 63 శాతం వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో జిల్లాలోని మోయతుమ్మెద, హల్దీ వాగు, కూడవెల్లి వాగులు పరిమితికి మించి ప్రవహించాయి.



వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ఒడిదుడుకుల వ్యవసాయం

ఈ ఏడాది జిల్లా రైతులకు కాలం కలిసిరాలేదు. పంటచేతి కందే సమయంలో అతివృష్టితో వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయారు. భారీ వర్షాలు కురవడంతోపాటు మిఛాంగ్ తుపాన్ దెబ్బకు రైతులు వణికిపోయారు. అలాగే, రబీ సీజన్‌లో పంట నష్టపోయిన వారికి ఇంతవరకు పరిహారం అందలేదు. పూర్తి స్థాయిలో రుణమాఫీ కూడా కాలేదు. ఈసారి ఇంకా రైతుబంధు రాలేదు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య రైతులు వివిధ పంటలు సాగు చేసి ఏడాది పొడవునా అవస్థలు పడుతూనే వచ్చారు.

– మెదక్

- ఏడాది పొడవునా వెంటాడిన అతివృష్టి
- వేలాది ఎకరాల్లో పంటలు ధ్వంసం
- పరిహారం ఇవ్వకుండా చేతులెత్తేసిన గత ప్రభుత్వం
- రుణమాఫీ, రైతుబంధు రాక అవస్థలు
- కష్టాల కడలిలో జిల్లా రైతులు

జిల్లాలో ఈ సంవత్సరం రబీ సీజన్‌లో 3.45 లక్షల ఎకరాల్లో వరితోపాటు వివిధ రకాల పంటలను సాగు చేశారు. తీరా పంట చేతికందే ఏప్రిల్ నెలలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా 12, 265 ఎకరాల్లో వరితోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. అప్పట్లో సీఎం కేసీఆర్ రైతులను ఆదుకుంటానని, ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తానని రైతులకు హామీ ఇచ్చారు. జిల్లాలో రూ.12 కోట్ల 25 లక్షల 86 వేల పంట నష్టం వాటిల్లిందని గుర్తించారు. ఈ మొత్తాన్ని బాధిత రైతులకు పరిహారం రూపంలో ఇవ్వాల్సి ఉంది. కానీ కేవలం రూ. 8.86 లక్షలు మాత్రమే ఇచ్చారు.

కాని రుణమాఫీ..

జిల్లాలో రూ.లక్షలోపు రుణాలకు 1,50,514 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వీరికి రూ.912 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 73,026 మంది రైతులకు రూ.366 కోట్లు మాత్రమే మాఫీ అయ్యింది. ఇంకా 77,488 మంది రైతులకు గాను రూ.546 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.ఈ రుణమాఫీ కోసం నిత్యం బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పారు. దీనికి గాను రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అందని రైతుబంధు..

ప్రభుత్వం మారినప్పటికీ ఈ యాసంగి పంట సాగు కోసం రైతు బంధు ఇంకా అందలేదు. జిల్లా వ్యాప్తంగా 3,06,437 ఎకరాల్లో వరితోపాటు ఇతర పంటలను 2,80,949 మంది రైతులు సాగు చేశారు. వీరికి పాత పద్ధతిన ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.200 కోట్ల 71 లక్షల 74 వేలు రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం ఎకరం లోపు ఉన్న 1,11,241 మంది రైతులకు కేవలం రూ. 21 కోట్ల 9 లక్షల 81 వేలు జమ అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 90 శాతం నిధులు రావాల్సి ఉంది. ఇప్పటికే సగం మేర వరినాట్లు పూర్తి అయ్యాయి. అన్నదాతలు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తూ పెట్టుబడికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తగ్గిన ఆయిల్ పామ్ సాగు

జిల్లాలో ఎప్పుడు ఒకే రకమైన వరి పంటనే సాగు చేస్తున్నారని, దీని వల్ల భూసారం దెబ్బతింటుందని, వరికి బదులు అధిక లాభాలు గడించే ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు. గత ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు మంజూరు ఇచ్చింది. ఇందు కోసం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, ఆయిల్ పామ్ మొక్కలకు ఎకరాకు రూ. 50 వేలు సబ్సిడీ ప్రకటించారు. 5 వేల ఎకరాలకు తగ్గకుండా ఆయిల్ పామ్ సాగు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. కానీ కేవలం వెయ్యి ఎకరాలు మాత్రమే సాగు చేసేందుకు రైతులు ముందుకొచ్చినట్లు సంబంధిత ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొన్నారు.



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణానికి, జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ అన్నారు. గురువారం స్వామివారి కల్యాణ ఏర్పాట్లతోపాటు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ నాగరాజుతో కలిసి జాతర బ్రహ్మోత్సవాల్లో భద్రత, పార్కింగ్ తదితర విషయాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు 50 గదుల నిర్మాణం, త్రిశూలం ఢమరుకం, క్యూ కాంప్లెక్స్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆలయ ఈవో బాలాజీని ఆదేశించారు.



పోలీసులతో జాతర, బ్రహ్మోత్సవాలపై చర్చిస్తున్న అనిల్‌కుమార్

ఆలయంలో కరోనా వ్యాప్తికి చర్యలు చేపట్టాలని, భక్తులు మాస్క్ ధరించి ఆలయ అధికారులకు సహకరించాలన్నారు. జాతర బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం జిల్లా అధికారులు త్వరలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ శేఖర్, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువ రైతు మృతి



కమల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ఘటన
- న్యాయం చేయాలని బంధువుల ఆందోళన

ఝరాసంగం(జహీరాబాద్): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువ రైతును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మన్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మన్ పల్లి గ్రామానికి చెందిన శేరి కమల్(28) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం పశువుల పేడను గ్రామ శివారులోని పెంటకుప్పలో వేసి నడుచుకుంటూ ఇంటికొస్తున్నాడు. ఇదే సమయంలో జహీరాబాద్ నుంచి కోడూర్ వైపు వెళ్తున్న జహీరాబాద్ డిపో బస్సు కమల్‌ను వెనుకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేష్, ఝరా సంగం ఎస్ఐ రాజేందర్ రెడ్డి, రాయికోడ్ ఎస్ఐ వెంకట్ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందించి, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. పోలీసులు కలుగజేసుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. మృతుడి భార్యశేరి నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతుడికి ఐదు నెలల బాలుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం ఉన్నారు.



శేరి కమల్ (ఫైల్)

అప్పుల బాధతో ఇద్దరు ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో అప్పుల బాధతో ఇద్దరు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. నిజాంపేట మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామంలో వృద్ధుడు, కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మనోవేదనకు గురై..



మల్లయ్య(ఫైల్)

నిజాంపేట(మెదక్): ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తెల్లవారు జామున మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తిప్పనగుల్ల గ్రామానికి చెందిన బెల్లం మల్లయ్య (53) వరి సాగు చేయగా దిగుబడి సరిగా రాలేదు. దీంతో అప్పుల పాలయ్యాడు. అలాగే, ఐదేళ్ల క్రితం నుంచి తనకు తమ పాలివారికి భూమి విషయంలో తగాదా నడుస్తోంది. దీంతో ప్రతిరోజూ మల్లయ్య చింతిస్తూ బాధపడుతుండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన మల్లయ్య తిప్పనగుల్ల-బచ్చురాజ్‌పల్లి రహదారి పక్కన చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో..



యాదుల్ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తారా సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూదేకుల యాదుల్(34) వ్యవసాయం చేస్తూనే చికెన్ సెంటర్‌ను నడుపుతున్నాడు. వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడం, అప్పులు తీర్చేమార్గం లేక మానోవేదకు గురయ్యేవాడు. బుధవారం రాత్రి భోజనం చేసి పొలం వద్దకు వెళ్తానన్న వ్యక్తి ఉదయం వరకు తిరిగి రాలేదు. అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి భార్య అస్మా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తండ్రి చనిపోయిన నెల రోజులకే..

రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రామాయంపేట(మెదక్): తండ్రి చనిపోయిన సరిగ్గా నెలరోజులకే కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన గుజ్జ గుర్గిల్ (55) నవంబర్ 28న గుండెపోటుతో మృతిచెందాడు. గుర్గిల్‌కు ఇద్దరు కుమారులతో పాటు కూతురు ఉంది. పాల వ్యాపారం చేస్తున్న చిన్న కుమారుడు గుజ్జ సురేశ్ (24) గురువారం బైక్‌పై రామాయంపేటవైపు వస్తున్నాడు. సుతారిపల్లి నుంచి నర్సంపల్లి వైపు బైక్‌పై వెళ్తున్న ఓ కానిస్టేబుల్ సురేశ్ బైక్‌ను వేగంగా ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన సురేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొని ధర్మారం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలికి చేరుకొని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోలీసుల జోక్యంతో ఆందోళన విరమింపజేశారు. ఈ మేరకు ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లను ఢీకొట్టిన లారీ

మహిళ మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



వెంకటమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చేగుంట(తూప్రాన్): రెండు బైక్‌లను లారీ ఢీకొట్టడంతో మహిళ మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చేగుంట శివారులోని మెదక్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట మండలం చందంపేట గ్రామానికి చెందిన సంజయ్‌గౌడ్ ఆర్ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్నాడు. చేగుంటలో మందులు కొనుగోలు చేసి పేట వైపు స్కూటీపై దేవబ్రత్‌దేవ్‌ను ఎక్కించుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో మెదక్ నుంచి చేగుంట వైపుకు వస్తున్న లారీ పొలంపల్లి చెరువు వద్ద సంజయ్ స్కూటీని ఢీకొట్టింది. కొంత దూరం ముందుకు వెళ్లిన లారీ మోపెడ్‌పై చేగుంట బంధువుల అంత్యక్రియలకు వెళ్తున్న బూదయ్య, వెంకటమ్మలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పేట మండలం చందాపూర్‌కు చెందిన వెంకటమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందింది. సంజయ్‌గౌడ్, బీహార్‌కు చెందిన దేవబ్రత్‌దేవ్, చందాపూర్‌కు చెందిన బూదయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. లారీ మరికొంత ముందుకు వెళ్లి ఓ పరిశ్రమ కార్మికుల బస్సును ఢీకొట్టి ఆగిపోయింది. ప్రమాదాలకు కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వెంకటమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి.. శవమై తేలి

గజ్వేల్‌రూరల్: చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హవేలి కాలనీకి చెందిన మీర్ హర్షద్ అలీ (37)కి భార్య రేష్మ, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే అతడు సంగుపల్లిలోని చెరువులో అప్పుడప్పుడు చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. పిల్లలకు సెలవులు రావడంతో ఈనెల 24న రేష్మ సిద్దిపేటలోని తన తల్లిగారింటికి పిల్లలతో వెళ్లింది. తిరిగి ఇంటికి చేరుకున్న రేష్మకు మీర్ హర్షద్ అలీ కనిపించలేదు. కుటుంబ సభ్యులతో కలిసి వెతుకుతుండగా గురువారం సంగుపల్లి చెరువులో శవమై కనిపించాడని, చెరువు వద్ద బైక్, సెల్‌ఫోన్ ఉన్నాయని స్థానికులు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న బాధిత కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.